Visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

నిజామాబాద్

కామారెడ్డి

సోమవారం, 10 జూన్ 2024 , పేజీలు : 03.

## ఇసుక క్వారీలో రగడ....

## కొట్టుకున్న నాయకులు..

- పర్మిషన్ లేని చోట త్రవ్వకాలు
- నిలిచిపోయిన లారీలు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి, సూర్య మేజర్ న్యూస్, జూన్ 9

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మంజీరా నదిలో ఆదివారం పెద్ద రగడే జరిగింది. మంజీరా నదిలో నిబంధనలను పాతరేస్తూ రెండు పదుల సంఖ్యలో జేసీబీలతో తవ్వకాలు జరుపుతూ, ప్రతీ రోజు సుమారు రెండు వందల లారీలకు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తరలించడం జరుగుతున్న విషయాన్ని తెలుసుకున్న బీర్కూర్ ఎంపీపీ తిలకేశ్వరి రఘు, ఎంపీటీసీ సందీప్, కో -అప్షన్ ఆరీఫ్, నాయకులు రాజు, మన్నాన్, రఘు, సాయి కుమార్ లు క్వారీ కి వెళ్లగా అక్కడే ఉన్న క్వారీ నిర్వహకులు సాహెబ్ రావు, ఏసు అనే వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. దీంతో ఎంపీపీ 100కు డయల్ చేసి క్వారీ వద్దకు పోలీసులను పిలిపించారు. తదనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మంజీరాలో ఇసుక క్వారీని నడిపిస్తున్న నిర్వాహకులు అనుమతులు ఉన్న ప్రాంతంలో తవ్వకాలు జరుపకుండా తమ బీర్కూర్ మంజీరా ప్రాంతంలో ఇసుకను తవ్వుతున్నారని, స్టాక్ పాయింట్ నుండి ఇసుకను అనుమతులు ఉన్నమట్టుకే ఇసుకను లారీలు, టిప్పర్లలో నింపి, ఓవర్ లోడ్ లేకుండా, పర్మిట్లు ఉంటేనే తరలించడం వదిలిపెట్టి, ఇష్టం వచ్చిన రీతిలో నింపుతూ పర్మిట్లు లేకుండా లారీలు, టిప్పర్లను జీరోలో తరలిస్తున్నారన్న సమాచారంతో తాము టీఎస్ఎండిసీ అధికారులను కలిసి వివరాలు తెలుసుకుందామని చుస్తే తమపై దాడి జరిగిందని, ఇది అన్యాయమని అన్నారు. తాము నిబంధనలకు లోబడి జరిగే పనులకు వ్యతిరేకం కాదని, నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను తరలిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. సుమారుగా మూడు గంటల వరకు ఇసుక లారీలు, టిప్పర్లు నిలిచిపోయాయి. క్వారీ ప్రాంతానికి బీర్కూర్, బిచ్కుంద ఎస్ఐలు అందుబాటులో లేకపోవడంతో మద్నూర్ ఎస్ ఐ శ్రీకాంత్ వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు. అప్పటికి గానీ టీఎస్ఎండీసీ అధికారి బయటకు రాకపోవడం గమనార్హం. దీంతో సమస్య సద్దుమణిగింది. ఎస్ ఐ వచ్చి పిలిస్తే గానీ టీఎస్ఎండీసీ అధికారి రాంరెడ్డి గదిలో నుండి బయటకు రావడంతో ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు తెల్లమొఖం వేశాడు. ఇకనుండి ఎలాంటి తప్పిదం జరగకుండా చూస్తానని హామీ ఇచ్చాడు. దాడికి పాల్పడిన వారిపై పిర్యాదు ఇవ్వాలని ఎస్ ఐ తెలియజేయగా ప్రజాప్రతినిధులు బిచ్కుంద పోలీస్ స్టేషన్ వెళ్లి పిర్యాదు చేశారు.



## బిచ్కుంద మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తం

- అడ్రస్ లేని అధికారులు
- వీధి నిర్వహణలో పారిశుద్ధ్య కార్మికుల నిర్లక్ష్యం
- కార్యదర్శి సహా మండల పంచాయతీ అధికారికి విన్నవించిన చర్యలు శూన్యం

బిచ్కుంద, సూర్య మేజర్ న్యూస్, జూన్ 9

అసలే వర్షాకాలం ప్రారంభం ఆపై సీజనల్ వ్యాధులకు ప్రధాన కారణం అయ్యే పారిశుద్ధ్య లోపం మూలంగా బిచ్కుంద మండలంలోని మేజర్ గ్రామపంచాయతీలోనే ఈ పరిస్థితులు దాపురిస్తే ఇక ప్రజల బాధలు అధికారులకు పట్టవా అనే చందంగా మారింది బిచ్కుంద మేజర్ గ్రామపంచాయతీ పరిస్థితి వివరాల్లోకి వెళితే, మండల కేంద్రంలోని స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో అవసరానికి మించి పారిశుద్ధ్య సిబ్బంది మొదలుకొని సహాయకులు మరియు కారోబార్లు ఒకరికి మించి ఇద్దరు ఉండడమే కాక, కార్యదర్శి సీనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్ ల సహా వారికి సైతం తోక సహాయకులు ఏర్పాటు చేసుకొని ప్రజల ద్వారా వచ్చి పన్నులు ప్రభుత్వపరంగా వచ్చే పలు నిధులను సైతం ఇష్ట రాజ్యాంగ వాడుకుంటూ ప్రజల సమస్యలను గాలికి వదిలి పంచాయతీ వ్యవస్థని నాశనం చేసే ధోరణికి పూనుకోవడం గమనించదగ్గ విషయం. ఇదిలా ఉంటే గ్రామపంచాయతీ పరిధిలోని రోజువారి చేపట్టే పనుల్లో భాగంగా ప్రధాన భూమిక పోషించే పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారి, సిబ్బంది పూర్తిస్థాయిలో ఉన్నప్పటికీ ఆయా ప్రజల నివాసాలు ఉంటున్న వార్డుల్లో రోజువారి చెత్త సేకరణ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుండడం మూలంగా ప్రజలు సైతం ఎక్కడబడితే అక్కడ చెత్తను వేయాల్సిన పరిస్థితులు దాపురించాయి. కారణం సదరు పంచాయతీ ఉన్నతాధి కారుల మొదలుకొని పారిశుద్ధ్య సిబ్బంది వరకు చెత్త వేసేందుకు సౌకర్యాలు కల్పించకపోవడం మూలంగా రోడ్లపైనే వేసిన చెత్తను రోజువారీగా సిబ్బంది తరలించకపోవడం ఇందుకు నిదర్శనం. చెత్తను వేసే సదుపాయం లేకపోవడంతో స్థానిక ఒకటో వార్డు నుండి మొదలుకొని పలు ప్రాంతాల్లో ఉన్నటు వంటి నాళాల్లోనే ప్రజలు చెత్తను వేయాల్సిన పరిస్థితులు దాపురించాయి. కనీసం రోజువారి చెత్త సేకరణలో భాగంగా అధికారులు సదరు గ్రామ పంచాయతీకి రెండు ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని సరైన పనులకు విధించ వినియోగించని కారణంగా ఎక్కడి చెత్త అక్కడే నాళాల్లో పేరుకుపోయి వర్షాకాలం ప్రారంభంలోనే పలు నాళాలు కంపు కొడుతున్నాయి ఈ విషయమై స్థానిక **సూర్య ప్రతినిధి** నేరుగా బిచ్కుంద ఎంపీ ఓ మహబూబ్ తో పాటు కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ కు సమాచారం అందించిన, ఎలాంటి ఉలుకు పలుకు లేకుండా వ్యవహరించడం ఇందుకు నిదర్శనం. ఇకనైనా సదరు మేజర్ గ్రామపంచాయతీ సమస్యల విషయమై తక్షణమే జిల్లా స్థాయి అధికార యంత్రాంగమైన జిల్లా పంచాయతీ శాఖ అధికారుల నుండి మొదలుకొని జిల్లా కలెక్టర్ స్వయంగా ఆకస్మిక తనిఖీల రూపంలో అధికారుల్లో ఉలుకు పలుకు లతో కూడిన విధంగా చలనం తీసుకువచ్చి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్థానిక మేజర్ గ్రామపంచాయతీ సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకొని పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చూడాలని పలువురు గ్రామ ప్రజలు కోరుతున్నారు.



## గాలి వాన బీభత్సం – షెడ్లు ధ్వంసం

కామారెడ్డి, సూర్య మేజర్ న్యూస్, జూన్ 9 :

కామారెడ్డి జిల్లాలోని ఆదివారం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వానతో భారీ వర్షంతో పశువులకు సంబంధించిన రెండు రేకుల షెడ్లు పూర్తిగా కొట్టుకపోవడం కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలో సంఘటన చోటుచేసుకుంది. మండలంలోని కరడపల్లి గ్రామానికి చెందిన గొల్ల అంజయ్యకు సంబంధించిన రెండు పశువుల రేకుల షెడ్లు ఈదురు గాలులతో పూర్తిగా కొట్టుకుపోవడం జరిగింది. రేకులు షెడ్డు గాలికి లేచి కింద పడటంతో అందులో ఉన్న మూడు ఆవులకు తీవ్ర గాయాలు కావడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. ఈ సందర్భంగా కరెంట్ పల్లి గ్రామానికి చెందిన రైతు గొల్ల అంజయ్య మాట్లాడుతూ ఈదురు గాలులతో వడగండ్ల వాన రావడంతో నా యొక్క రెండు పశువులు రేకుల షెడ్లు పూర్తిగా గాలికి కొట్టకుపోయాయాని ఆవేదన వ్యక్తం చేసారు. వర్షం వచ్చినప్పుడు 11 ఆవులు ఉన్నాయని అందులో ఈదురు గాలులతో కూడిన వర్షానికి షెడ్డు కింద ఉన్న మూడు ఆవుల పైన పడి, తీవ్ర గాయాలు కావడం జరిగిందని అన్నారు. సుమారు ఐదు లక్షల రూపాయల ఆస్థి నష్టం జరిగిందని, మేము పశువులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, దయచేసి అధికారులు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు స్పందించి న్యాయం చేసి ఆదుకోవాలని కోరారు.



# స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్ సర్వీస్ పాయింట్ నిర్వాహకుడి ఇష్టరాజ్యం

- లావాదేవీల నిర్వహణలో వినియోగదారులతో దురుసు గా వ్యవహరిస్తున్న వైనం
- నిబంధనలకు విరుద్ధంగా అదనపు చార్జీల వసూళ్లు
- బిచ్కుంద బ్యాంకు మేనేజర్ కు ఫిర్యాదు ల వెల్లువ

**సూర్య మేజర్ న్యూస్ బిచ్కుంద జూన్ 9:**

బిచ్కుంద మండల కేంద్రంలోని స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు పరిసర ప్రాంతంలో ఉన్నటువంటి ఓ కసమర్ సర్వీస్ పాయింట్ నిర్వాహకుడి ఇష్ట రాజ్యం మూలంగా వినియోగదారులు పలు అవస్థలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి దాపురించాయి. వివరాల్లోకి వెళితే స్థానిక కస్టమర్ సర్వీస్ పాయింట్ నిర్వాహకుడైన కుశాల్ రెడ్డి అనే వ్యక్తి తన వద్ద వచ్చే లావాదేవీలు నిర్వహించుకునే వినియోగదారుల పట్ల దురుసుగా వ్యవహరిస్తూ వినియోగదారులను నానా తిప్పలకు గురి చేస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది తాను అందించాల్సిన సేవల్లో భాగంగా వినియోగదారుల బ్యాంకు ఖాతాలు కలిగిన లావాదేవీల విషయంలో తారతమ్యాలు సృష్టిస్తూ కక్షపూరితంగా వ్యవహరిస్తూ తనకు సహకరించని వారికి సేవలో ఆటంకం సృష్టించడం ఆపై బయోమెట్రిక్ రూపేనా ఏవైనా ఖాతాల్లో సమస్యలు తలెత్తిన పక్షంలో సర్వీసులో భాగంగా బయోమెట్రిక్ సేవల అందించడానికి ఎలాంటి రుసుము తీసుకోవాల్సిన అవసరం లేకున్నా ఒక్కో వినియోగదారు నుండి అనధికారిక రుసుమును డిమాండ్ చేయడం కోసమేరుపు ఈ విషయమై స్థానిక సూర్య మేజర్ న్యూస్ స్వయంగా తాను లావాదేవీలు నిర్వహించుకునేందుకు సదరు నిర్వాహకుడి దగ్గరకు వెళ్లిన పక్షంలో సేవలు అన్ని అందుబాటులో ఉన్న తాను మాత్రం సేవలకు నిరాకరించడం తో స్థానిక ఎస్బిఐ మేనేజర్ను ఈ విషయమై ఫిర్యాదు చేయగా స్పందించిన మేనేజర్ తాను ఇలాంటి పొరపాట్లు జరగకుండా శాఖ పరమైన చర్యలు తీసుకుంటానని పలుమార్లు చెప్పిన నేటి వరకు సదరు వ్యక్తిపై ఎలాంటి శాఖా పరమైన చర్యలు తీసుకోకపోవడం గమనించదగ్గ విషయం ఈ విషయమై బ్యాంకు ఉన్నత అధికార వర్గాలు తక్షణమే స్పందించి సదరు నిర్వాహకుడు సాగిస్తున్న ఆగడాలకు అడ్డుకట్ట పడేలా సదరు సిఎస్పి కేంద్రంపై విచారణ చేసి నిర్వాహకుడిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వినియోగదారులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# రోడ్డు ప్రమాదంలో అంతంపల్లి గ్రామానికి చెందిన యువకుని మృతి

**బిక్కనూర్, జూన్ 09, సూర్యా మేజర్ న్యూస్:**

మెదక్ జిల్లా చేగుంట మండల శివారులో 44వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని అంతంపల్లి గ్రామానికి చెందిన పిట్ల కుమార స్వామి (32) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుమార స్వామి చేగుంట మండలంలోని పెద్ద శివనూర్ గ్రామం నుండి తన సోదరిని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని రామాయంపేట వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కుమార స్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గాయపడ్డ వారిని రామాయంపేట ఆస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుమారస్వామికి భార్య నాలుగు సంవత్సరాల కూతురు ఉంది. కుమార స్వామి మృతితో అంతంపల్లి గ్రామంలో విషాద ఛాయలు అనుముకున్నాయి.



# అరకోటితో నిర్మించిన రైతు శిక్షణ భవనం నిరుపయోగం

- ఎనిమిదేళ్లుగా పడావుగా మారిన రైతు శిక్షణ కేంద్రం
- కామారెడ్డి జిల్లా అధికారుల అలసత్వానికి నిదర్శనం

**కామారెడ్డి, సూర్య మేజర్ న్యూస్ జూన్ 9**


కొత్త సాగు పద్ధతులు, కొత్తకొత్త వంగడాలు, సాగులో మెళకువలు లాంటి విషయాల్లో రైతులకు అవగాహన కల్పించాలనే లక్ష్యం తో అరకోటి రూపాయలు పెట్టి కామారెడ్డిలో రైతుల శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. సర్కారు లక్ష్యం, అధికారుల ఆలోచన బాగానే ఉన్నా, ఆచరణలో మాత్రం అలసత్వం కొనసాగుతోంది. ఎనిమిదేళ్ల క్రితం జిల్లా కేంద్రంలోని పాతరాజంపేట శివారులో విజయ పాల డెయిరీ ఆవరణలో నిర్మించిన ఈ భవనం ఇప్పటికీ నిరుపయోగంగానే మిగిలిపోతోంది. ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో పాలకవర్గాన్ని నియమించినా రైతుల ప్రయోజనం కోసం పట్టించుకునే వారే కరువయ్యారు. ఆత్మ పథకం నిధులతో వ్యవసాయ క్షేత్రాల సందర్శన పేరిట విహార యాత్ర లతో ఎంజాయ్ చేస్తున్న కమిటీ సభ్యులు. రైతులకు తగిన సమాచారం, సలహాలు అందించే శిక్షణ తరగతుల పట్ల మాత్రం శ్రద్ధ చూపక పోవడం వారి నిర్లక్ష్యాన్ని, రైతుల పట్ల చిత్తశుద్ధిని ఎత్తిచూపుతోంది.



# జేఈఈలో ప్రతిభ కనబరిచిన పరుమళ్ళ విద్యార్థి

**లింగంపేట్, జూన్ 09, సూర్య మేజర్ న్యూస్**

లింగంపేట్ మండలంలోని పరుమల్ల గ్రామానికి చెందిన మరిపల్లి పోషగౌడ్,శోభారాణిల కుమారుడు మరిపల్లి హర్షత్ గౌడ్ కు జేఈఈలో ఆల్ ఇండియాలో ర్యాంకు సాధించి పలువురి మన్ననలు పొందారు.ఆదివారం విడుదలైన జేఈఈ ఫలితాల్లో ఆలిండియా లెవెల్లో 8879 ర్యాంక్ సాధించి ప్రతిభ కనబరిచారు. ఇతనిని గ్రామస్తులు పలువురు అభినందించారు.



# బిజెపి కి మెజార్టీ ఇచ్చిన నియోజకవర్గ ప్రజలకు ధాన్యవాదాలు..

■బిజెపి రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి.

**ఎల్లారెడ్డి, 09 జూన్, సూర్య మేజర్ న్యూస్**

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఆదివారం ముత్యపు రాఘవులు పంక్షన్ హాల్ లో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి పాత్రికేయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి మాట్లాడుతూ పార్ల మెంట్ ఎన్నికల లో బిజెపి పార్టీనీ ఆధరించి జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల లో బిజెపి కి ఎక్కువ మెజార్టీ ఇచ్చినందుకు ఎల్లారెడ్డి నియోజక వర్గ ప్రజలకు ప్రత్తేక దన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో మండల అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, కార్య కర్తలు ప్రతి ఒక్కరు బాగా కష్టపడ్డారని, వారి ద్వారానే బిజెపి మెజార్టీ సాధించింది అని అన్నారు. ఎల్లారెడ్డి ప్రజలకు ప్రత్యేకంగా రుణ పడి వున్నామని అన్నారు. అనంతరం వైస్ ఎంపీపీ పెద్దేడ్ల నర్సింలు , నాగిరెడ్డి పెట్ మాజీ ఎంపిపి దివిటీ రాజ్ దాస్ లు మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీని బలోపేతం చేసి అత్యధిక స్తానాలు కైవసం చేసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమం లో పట్టణ అధ్యక్షులు కుసలకంటి సతీష్, ఆకుల కిష్టయ్య, మాజీ ఎంపిపి నక్క గంగాధర్, వంజరీ గణేష్, కోవురి బాల్ రాజ్, రమేష్, అల్లం పండరి, నాగిరెడ్డిపెట్ నాయకులు తదితరులు పాల్గొన్నారు



# సంబరాలు చేసిన నాయకులు

**కామారెడ్డి అర్బన్, సూర్య మేజర్ న్యూస్, జూన్ 9**

నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిజాంసాగర్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు టపాకాయలు కాల్చి, మిఠాయిలు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ., దేశ ప్రజలు కేంద్రంలో నరేంద్ర మోదిని ప్రధానిగా గెలిపించారని, అలాగే కేంద్ర మంత్రులుగా తెలంగాణ రాస్ట్రానికి చెందిన కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు ప్రమాణ స్వీకారం చేయటం కూడా తెలంగాణ ప్రజలకు బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన గౌరవం అని అన్నారు.



# కామారెడ్డి అభివృద్ధికై కలిసి నడుద్దాం

- ట్యాక్సులు, పార్కింగ్, ఓపెన్ ప్లాట్ల విషయంలో కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటాం
- రాష్ట్రంలో ఇతర పట్టణాలు మనల్ని ఆదర్శంగా తీసుకోవాలి
- అన్ని వర్గాల వ్యాపారస్తులు సహకరిస్తే అభివృద్ధి సాధ్యం అవుతుంది
- అవినీతి కారణంగానే కామారెడ్డి అభివృద్ధి కుంటుబడింది
- అభివృద్ధి విషయంలో సలహాలు, సూచనలు ఇవ్వండి ఆచరించి చూపిస్తా
- అభివృద్ధి శంఖారావంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి



కామారెడ్డి జిల్లా ప్రతినిధి, సూర్య మేజర్ న్యూస్, జూన్ 9

కామారెడ్డి పట్టణం సమూల అభివృద్ధి కోసమై పట్టణంలోని అన్ని రంగాల వ్యాపారస్తులతో రాజారెడ్డి గార్డెన్స్ లో కామారెడ్డి అభివృద్ధి శంఖారావం కార్యక్రమం శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కామారెడ్డి పట్టణంలోని అన్ని రకాల వ్యాపారస్తులు హాజరై తమ సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కామారెడ్డి పట్టణ అభివృద్ధి విషయంలో తాను అనుకుంటున్న విషయాలను పవర్ పాంట్ ప్రజెంటేషన్ ద్వారా చూయించి అందరికీ అర్థం అయ్యేలా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ., కామారెడ్డి అభివృద్ధికై కలిసి నడుద్దామని అన్నారు. అభివృద్ధి విషయంలో ట్యాక్సులు, పార్కింగ్, ఓపెన్ ప్లాట్ల కు సంబంధించి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటామని, ప్రజలు సహకరించాలని అన్నారు. రాష్ట్రంలో ఇతర పట్టణాలు మనల్ని ఆదర్శంగా తీసుకోవాలనీ అన్నారు. అన్ని వర్గాల వ్యాపారస్తులు సహకరిస్తేనే అభివృద్ధి సాధ్యం అవుతుందనీ అన్నారు. అవినీతి కారణంగానే కామారెడ్డి అభివృద్ధి కుంటుబడిందనీ గుర్తు చేశారు. అభివృద్ధి విషయంలో సలహాలు, సూచనలు ఇవ్వండి ఆచరించి చూపిస్తానని అన్నారు.



# మహిళా మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ

- ♦ బైక్ పై వచ్చిన ఇద్దరు గుర్తులేని దొంగలు
- ♦ ఇంటి ఎదుట నిలబడిన మహిళా మెడలోంచి చోరీ
- ♦ సీసీ కెమెరాలు చిక్కిన దొంగలు

పిట్లం, సూర్య మేజర్ న్యూస్, జూన్ 9

ఇంటి ఎదుట నిలిచి ఉన్న మహిళా మెడలో నుంచి గుర్తు తెలియని ఇద్దరు దుండగులు బైక్ పై వచ్చి మహిళా మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును చోరీ చేసుకుని వెళ్ళిన సంఘటన కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండల కేంద్రానికి చెందిన గడ్డం శకుంతలా అనే మహిళ వరుసకు అత్తమ్మ అయినా నరసమ్మ తో కలిసి ఆదివారం ఉదయం తన కూతురు పిట్లంలో ఉండగా వారి ఇంటికి పిట్లం బస్టాండ్ లో బస్సు దిగి కూతురు ఇంటి వద్దకు రాగానే గుర్తు తెలియని ఇద్దరు యువకులు బైక్ పై వచ్చి ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు అపహరించి పల్సర్ బైక్ పై పరారయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం. అందించడంతో దుండగుల కోసం వెతకగా సమీపంలో ఉన్న ఓ దుకాణంలో సీసీ కెమెరాలు ఇద్దరు దుండగులు బైక్ పై వెళుతున్న దృశ్యాలు పోలీసులకు లభించినట్లు తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి త్వరలోనే దుండగులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.



# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సధాశివనగర్, జూన్ 9, సూర్య మేజర్ న్యూస్

సదాశివనగర్ మండలం ఉత్నూర్ పాఠశాల 1993 - 94 బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాల్గొని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. అప్పట్లో పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు తెలిపారు.



# నాయక్ పోడ్ విద్యార్థులకు ఉత్తమ పురస్కారాలు

లింగంపేట్, జూన్ 09, సూర్య మేజర్ న్యూస్

ఉత్తమ ప్రతిభ కనబరిచిన నాయక్ పోడ్ విద్యార్థులకు జిల్లా నాయక్ పోడ్ ఉద్యోగ సంఘాల నాయకులు విద్యార్థులకు ఉత్తమ పురస్కారాలు అందించారు. ఆదివారం లింగంపేట్ మండలంలోని డిపిఎల్ గార్డెన్ లో నిర్వహించిన కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా లోని 10, 12 వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి ర్యాంకులు సాధించిన నాయక్ పోడ్ విద్యార్థులకు జిల్లా నాయక్ పోడ్ ఉద్యోగులు విద్యార్థులకు శాలువలు కప్పి ఘనంగా సన్మానించి, షీల్డ్ లు బహుకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తడగరి సాయిలు మాట్లాడుతూ చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. విద్యార్థులు చదువులో ఉత్తమ ర్యాంకులు సాధించి తల్లిదండ్రులకు తమ గ్రామాలకు మంచి పేరు తీసుకువచ్చి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మన్నె రాంగోపాల్, పుట్ట వెంకట్, మెంగారం బాలు, అశోక్, పెంటయ్య, సాయిలు, నాయక్ పోడ్ పెద్దలు విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# నూతన జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడికి సన్మానం చేసిన మాజీ ఎంపీపీ నక్క గంగాధర్

ఎల్లారెడ్డి, 09 జూన్, సూర్య మేజర్ న్యూస్

ఎల్లారెడ్డి పట్టణనికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త కంచర్ల బాల కిషన్ గుప్తా కామారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఆదివారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోనీ అతని నివాసం వద్ద ఎల్లారెడ్డి మాజీ ఎంపీపీ నక్క గంగాధర్ శాలువాతో సన్మానం చేశారు. అనంతరం పుల బొకేను అందించి శుభాకాంక్షలు తెలియచేశారు.



# ఈనెల 14న కామారెడ్డిలో ఉద్యోగ మేళా

కామారెడ్డి, సూర్య మేజర్ న్యూస్, జూన్ 9

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఇంటర్ విద్యార్థుల కోసం ఈ నెల 14న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు డీఐఈవో షేక్ సలాం ఓ ప్రకటనలో తెలిపారు. టెక్ బి ప్రోగ్రాం కోసం సీఈసీ, హెచ్ఎసీ, వొకేషనల్ గ్రూప్ల లో ఇంటర్ పూర్తి చేసు కున్నవారు మేళాకు రావాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత ధ్రువపత్రం, ఇంటర్ మార్కుల ఆన్ లైన్ జాబితా, ఆధార్ కార్డుతో మేళాకు హాజరు కావాలని సూచించారు.

